సాక్షి తిరుపతి

శనివారం । 23 । ఆగస్టు । 2025



జానపద విజ్ఞానాన్ని కాపాడుకోవాలి

ఎస్వీయూలో జ్ఞానపద విజ్ఞాన దినోత్సవం జరుపుకున్నారు. - IIలో



ఆ డిపోలు.. స్త్రీశక్తికి దూరం

అలిపిరి , తిరుమల డిపోలు స్త్రీశక్తికి దూరంగా నిలిచాయి. ప్రభుత్వం సూచించిన బస్సులు ఆ డిపోలో లేవు. - IIలో



ప్రభుత్వ పాఠశాలలు దత్తత

ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలను దత్తత తీసుకుంటామని రోటరీ క్లబ్ అధ్యక్షుడు నాగూరయ్య చెప్పారు. - IIలో

న్యూస్‌రీల్

ఆర్టీసీలో ఆన్‌కాల్ డ్రైవర్లకు ఆహ్వానం

తిరుపతి అర్బన్ : జిల్లాలోని అన్ని ఆర్టీసీ డిపోల్లో ఆన్‌కాల్ డ్రైవర్లను తీసుకోవడానికి సిద్ధంగా ఉన్నామని జిల్లా రవాణా అధికారి జగదీష్ శుక్రవారం తెలిపారు. ఆసక్తి ఉన్నవారు ఆయా పరిధిలోని డిపో మేనేజర్లను సంప్రదించాలని సూచించారు. తిరుమల, తిరుపతి, మంగళం, పుత్తూరు, శ్రీకాళహస్తి, గూడూరు, వెంకటగిరి తదితర డిపోలో కాంట్రాక్ట్ పద్ధతిలో రోజు వారీ వేతనంతో తీసుకోవడానికి ఆర్టీసీ సిద్ధంగా ఉన్నట్లు స్పష్టం చేశారు. అయితే ఆర్టీసీ నిబంధనల ప్రకారమే తీసుకుంటామని చెప్పారు. ప్రధానంగా హెవీ వెహికల్ లైసెన్స్ పొంది 18 నెలలు పూర్తి చేసి ఉండాలని చెప్పారు

వికలత్వం 40 శాతం ఉంటే పింఛన్ : కలెక్టర్



దాక్టర్ వెంకటేశ్వర్, జిల్లా కలెక్టర్

తిరుపతి అర్బన్ : 40 శాతం అంతకంటే ఎక్కువ వికలత్వం ఉన్నట్లు తాత్కాలిక సదరం సర్టిఫికెట్ ఉన్న దివ్యాంగులకు పింఛన్లు యథావిధిగా సెప్టెంబర్‌లో అందిస్తారని కలెక్టర్ వెంకటేశ్వర్ శుక్రవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. మరోవైపు ఇటీవల సచివాలయ ఉద్యోగుల ద్వారా అందించిన నోటీసులను తిరిగి కార్యదర్శులు తీసుకోవడం జరుగుతుందని వివరించారు. ఆ మేరకు ప్రభుత్వం ఆదేశాల ఇచ్చిందని స్పష్టం చేశారు. అలాగే తాము అర్హులం అయినప్పటికీ రీవెరిఫికేషన్‌లో అనర్హులుగా గుర్తించి నోటీసులు అందుకున్న దివ్యాంగులు తమ పరిధిలోని ఎంపీడీవో, మున్సిపల్ కమిషనర్ కార్యాలయంలో 30 రోజుల్లో అప్పీలు చేసుకోవాలని కలెక్టర్ వెల్లడించారు.

విషం చిమ్ముతూ!

ఉన్నది లేనట్లు.. లేనిది ఉన్నట్లు చేయడంలో ఆరితేరిపోయారు.. తిమ్మిని బొమ్మిని చేయడంలో రికార్డులు బద్దలు కొట్టేశారు. తాము చెప్పిందే వేదమని నమ్మించేస్తారు. ప్రజలను తమ వైపు తిప్పుకునేందుకు లేనిపోనివి అల్లేస్తారు. తీరా ఒక అబద్ధాన్ని నిజమని నమ్మించేందుకు ప్రజలకు వినుగొచ్చేవరకు టీవీల్లో దుష్ప్రచారం చేస్తారు.. ఇలాంటిదే శుక్రవారం పుత్తూరులో చోటుచేసుకుంది. మద్యం కుంభకోణం విచారణలో భాగంగా సిట్ బృందం మాజీ డెప్యూటీ సీఎం నారాయణస్వామిని సుదీర్ఘంగా విచారించింది. ఆ సమయంలో కొన్ని మీడియా చానళ్ల చేసిన విషప్రచారాన్ని చూసి తిరుపతి, చిత్తూరు జిల్లాల ప్రజలు ఔరా..? అంటూ ముక్కున వేలేసుకునేలా చేసింది. ఎక్కడ సత్యం.. ఎక్కడ ధర్మం అంటూ చర్చించుకోవడం కనిపించింది.

మీడియాతో మాట్లాడుతున్న రాష్ట్ర మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి



సిట్ విచారణ వేళ పెచ్చు మీరిన పచ్చ మీడియా పైత్యం

- సత్యం వధ..ధర్మం చెర!
- మాజీ డెప్యూటీ సీఎం అప్రూవర్‌గా మారారంటూ దుష్ప్రచారం
- ఇంట్లో నోట్ల కట్టలంటూ వండివార్చిన వైనం
- నియోజకవర్గ ఇన్‌చార్జ్‌ని మారుస్తున్నారంటూ తప్పడు కథనం
- మండిపడ్డ మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

సాక్షి ప్రతినిధి, తిరుపతి: మద్యం కుంభకోణం విషయమై విచారణ కోసం సిట్ బృందం శుక్రవారం ఉదయం 10.30 గంటలకు పుత్తూరుకు చేరుకుంది. మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి ఇంటికి చేరుకున్న ఆ బృందం సాయంత్రం 5.30 గంటల వరకు సుదీర్ఘంగా విచారించింది. విషయం తెలుసుకున్న పచ్చమీడియా అక్కడకు ఉరుకులు పరుగుల మీద చేరుకుంది. ఉదయం నుంచి సాయంత్రం వరకు అతస్య కథనాలు.. వార్తలు వండి వార్చింది. కూటమి ప్రభుత్వానికి అనుకూలంగా ఉన్న కొన్ని టీవీ చానళ్లలో అయితే ఉన్నది లేనట్లు.. లేనిది ఉన్నట్లు నమ్మించే ప్రయత్నం చేయడం జిల్లా ప్రజలను ఆశ్చర్యానికి గురిచేసింది.

నిజం నిప్పులాంటిది

సిట్ విచారణ అనంతరం మాజీ ఉపముఖ్యమంత్రి నారాయణస్వామి మీడియాతో మాట్లాడారు. 'నిజం నిప్పులాంటిది. దాన్ని ఎవ్వరూ తప్పుబట్టలేరు. ప్రజలను తప్పుదారి పట్టించలేరు' అని తెలిపారు. 'మద్యం విషయం కోర్టులో నడుస్తోంది. కాబట్టి సిట్ బృందం ఇంటికి వచ్చి విచారణ చేట్టింది. అందులో తప్పేముంది. అయితే ఎల్లో మీడియా ప్రజలకు తప్పుడు సందేశాన్ని అందించి తప్పుదారి పట్టించాలని చూస్తోంది. గతంలో మద్యం షాపులను ప్రభుత్వమే నడిపింది. అలాంటప్పుడు అవినీతి ఎలా జరుగుతుంది..? నా రాజకీయ జీవితంలో ఎక్కడా అవినీతికి తావు లేకుండా మచ్చలేని నాయకుడిగా ఎదిగా. 50 ఏళ్ల ప్రజల కోసం సేవ చేశా. నియోజకవర్గంలో ఎక్కడికి వెళ్లినా నేను చేసిన అభివృద్ధి కంటికి కనిపిస్తుంది. అలాంటి వ్యక్తిపై బురద చల్లేందుకు పచ్చమీడియా నాపై నిందలు వేయడం మంచిది కాదు. సాక్ష్యాత్తు శ్రీవేంకటేశ్వర స్వామి సన్నిధిలో చైర్మన్‌గా ఉంటున్న వ్యక్తికి సంబంధించిన చానల్ మరీ దిగజారిపోయింది. అసత్యాలు వండి వారుస్తోంది. మీడియా అంటే నిజాన్ని నిర్భయంగా చెప్పాలిగానీ.. ఇలా అబద్ధపు ప్రచారం చేయడం నేను ఇప్పుడే చూస్తున్నా. విచారణలో ఏమి జరిగిందో ఎవ్వరికీ తెలియక పోయినా అప్పుడే నారాయణస్వామి అప్రూవల్‌గా మారిపోయాడు. ఆయనకు శిక్ష తప్పదని చెప్పడం దారుణం' అని ఆయన పేర్కొన్నారు.



విచారణ సందర్భంగా ఉత్కంఠగా ఎదురు చూస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

మరీ ఇంత బరితెగింపా?



నారాయణస్వామి ఇంటి వద్ద గుమికూడిన కార్యకర్తలు

సిట్ విచారణ సందర్భంగా ఎల్లో మీడియా పచ్చ పైత్యం పెచ్చుమీరింది. మాజీ ఉపముఖ్యమంత్రి నారాయణస్వామి అప్రూవర్‌గా మారిపోయారని నమ్మించేందుకు పదేపదే ఆ టీవీ చానళ్లలో స్క్రోలింగ్ ఇవ్వడం ప్రారంభించింది. అంతటితో ఊరుకోక ఆయన ఇంట్లో నోట్ల కట్టలు బయటపడుతున్నాయని ప్రజలను మునివేళ్లమీద నిలబెట్టే ప్రయత్నం చేసింది. ఇప్పటివరకు రూ.8 కోట్ల మేర బయటపడిందని.. ఇంకా పెద్ద మొత్తంలో నగదు స్వాధీనం చేసుకునే అవకాశం ఉందని పదేపదే అబద్ధపు ప్రచారం చేయడం మొదలు పెట్టింది. ఆపై ఏకంగా నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా ఉన్న కృపాలక్ష్మినే మార్చేస్తున్నారంటూ బోల్తాకొట్టించేందుకు ముప్పుతిప్పలు పడింది. దీన్ని జీర్ణించుకోలేని వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, జగనన్న అభిమానులు తప్పుడు వార్తలు చూసి ఛీ కొట్టడం కనిపించింది. ఆపై ఎల్లో మీడియా గోబ్యాక్.. పచ్చ పైత్యం నశించాలి అంటూ నినాదాలు చేయడంతో తోకముడవాల్సి వచ్చింది.

బాబు.. ఏడి పింఛెన్

- రీవెరిఫికేషన్ పేరుతో పింఛన్ల తొలగింపు
- లబోదిబోమంటున్న దివ్యాంగులు
- పేరుకే పింఛన్ పెంపు.. తొలగింపులే అధికం

దివ్యాంగుల బతుకుల్లో వెలుగులు నింపాల్సిన కూటమి ప్రభుత్వం వారిని మరింత కష్టాల్లోకి నెట్టింది. సాయంలేక నడవలేని అభాగ్యులు, సచ్చుబడిన కాళ్లతో తడబడుతూ వచ్చే దివ్యాంగులకు ఊతమివ్వకపోగా రీవెరిఫికేషన్ పేరుతో నోటికాడికి వచ్చే పింఛన్‌ను లాగేస్తున్నారు. ఎన్నో ఏళ్లుగా వస్తున్న పింఛన్‌ను ఉన్న ఫలంగా తీసేస్తే దానిమీదే ఆధారపడిన బతుకులు తలకిందులవుతున్నాయి. పేరుకు పింఛన్ పెంచి..మరోవైపు రీవెరిఫికేషన్ పేరుతో తొలగిస్తుండడంపై దివ్యాంగులు కన్నీరుమున్నీరవుతున్నారు.

పింఛన్ తొలగింపుతో ఆధారం పోయింది



భార్య పుష్పలతతో బాధితుడు ఉదయ్ భాస్కర్

ఈయన పేరు ఉదయ్ భాస్కర్. తిరుపతికి చెందిన వ్యక్తి. పోలియో బాధితుడు. 2018లో జరిగిన రోడ్డు ప్రమాదంలో నడవలేని స్థితి. రెండు కాళ్లు, నడుము దెబ్బ తినడంతో పైకి లేవలేని స్థితిలో ఉన్నాడు. గతంలో పింఛన్ కోసం వైద్య పరీక్షలు నిర్వహించగా 90 శాతం వైకల్యంతో సదరం సర్టిఫికెట్ ఇచ్చారు. దాని ఆధారంగా ఏడేళ్లుగా పింఛన్ తీసుకుంటున్నాడు. పింఛను నగదుపై ఆధారపడి జీవిస్తున్నాడు. ఈయన భార్య పుష్పలత ఉద్యోగానికి వెళితే ఉదయ్ భాస్కర్‌ను చూసుకునే వారు లేదు. ఇటీవల వెరిఫికేషన్ పేరుతో అర్హత లేకుండా చేశారు. నా భర్తను ఎలా పోషించాలి అంటూ పుష్పలత ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. -తిరుపతి తుడా

నేత కార్మికుడిగా పింఛన్ సాకు చూపి..



శశిరేఖ, నారాయణవనం

ఈమె పేరు శశిరేఖ, వయస్సు 65 సంవత్సరాలు. నారాయణవనం పద్మావతీ నగర్‌లో ఉంటోంది. రెండు కళ్ల చూపు పూర్తిగా లేకపోవడంతో 75 శాతం వైకల్యంతో సదరన్ సర్టిఫికెట్‌ను ప్రభుత్వం అందజేసింది. దీంతో రూ. 6 వేల పింఛను పొందుతోంది. ఈమె భర్త వీరస్వామి(91) నేత కార్మికుడిగా నెలకు 4 వేల పింఛను అందుకుంటున్నాడు. వీరి ఒకానొక కుమారుడు మృతి చెందడంతో కుటుంబ పోషణ భారం కావడంతో ఏడాదిగా కార్వేటినగరంలోని వృద్ధాశ్రమంలో ఉంటోంది. సదరన్ సర్టిఫికెట్ రీవెరిఫికేషన్‌తో ఈమె వైకల్యాన్ని 30 శాతానికి తగ్గించడమే కాకుండా, భర్తకు పింఛను వస్తోందన్న కారణంతో ఈమె పింఛను రద్దు చేశారు. - నారాయణవనం

నా కడుపుకొట్టారు..



తుపాకుల ప్రభాకర్ దివ్యాంగుడు, కురుగొండ

ఇతడి పేరు తుపాకుల ప్రభాకర్. ఓజిలి మండలంలోని కురుగొండ. కాలు వంకరగా ఉండి ఏ పనులు చేసుకోలేడు. ప్రభుత్వం మంజూరు చేస్తున్న దివ్యాంగుల పింఛన్ రూ.6 వేలతో జీవనం సాగిస్తున్నాడు. గత ప్రభుత్వంలో సదర్ క్యాంపులో డాక్టర్లు పరీక్షించి 45 శాతం వికలత్వం ఉందని ధ్రువీకరణపత్రం ఇచ్చారు. ఇటీవల నాయుడుపేటలో సదర్ క్యాంపులో డాక్టర్లు 40 శాతం కంటే తక్కువ ఉందని ధ్రువీకరణ పత్రం ద్వారా నోటీసు ఇచ్చారు. సెప్టెంబర్ నెల పింఛన్ రాదని తెలిపారు. నేను ఎలా జీవనం గడపాలని ఆవేదన చెందుతున్నాడు. - ఓజిలి

కన్నులేకున్నా కనికరించలే..



చిన్న బాలయ్య దివ్యాంగుడు, కురుగొండ

అతడి పేరు తీరాశెటి చిన్న బాలయ్య. ఓజిలి మండలంలోని కురుగొండ. ఎడమ కన్ను లేదు. గత ప్రభుత్వంలో అధికారులు 45 శాతం కంటే ఎక్కువగా అంధత్వం ఉందని ధ్రువీకరణ పత్రం ఇవ్వడంతో రూ.6 వేలు పింఛన్ ఇస్తుండేవారు. ప్రస్తుత ప్రభుత్వం 40 శాతం ఉందని గుర్తించి ఆరు వేలు వస్తున్న పింఛన్‌ను 4 వేలకు తగ్గించారు. కన్ను లేకున్నా కనికరం లేకుండా పింఛన్‌ను తగ్గించడం మంచి పద్ధతి కాదని విలపిస్తున్నాడు. - ఓజిలి

7 ఏళ్లుగా వస్తున్నా..ప్రస్తుతం పీకేశారు..



మాణికల రవి, సిద్ధవరం, కోట మండలం

ఈ చిత్రంలో ఉన్న వ్యక్తి మాణికల రవి, కోట మండలం సిద్ధవరం గ్రామం, 12 ఏళ్ల క్రితం రోడ్డు ప్రమాదంలో కాలు పూర్తిగా చితికి పోయింది. ఐదు పర్యాయాలు శస్త్ర చికిత్సలు చేశారు. అటు తరువాత సదరంలో పరీక్షలు చేసిన అనంతరం వైద్యులు దివ్యాంగుల ధ్రువపత్రం మంజూరు చేయడంతో ఏడేళ్లుగా దివ్యాంగుల పింఛన్ అందుకుంటున్నారు. ప్రస్తుతం అతడికి పింఛన్ తొలగించినట్లు నోటీసులు ఇవ్వడంతో దిక్కు తోచక కార్యాలయం చుట్టూ తిరుగుతున్నాడు. - చిల్లకూరు

15 ఏళ్లుగా వస్తున్నా..ఇప్పుడు రాదంటున్నారు..



సుబ్బమ్మ, గొల్లపాలెం, వాకాడు మండలం

ఆమె పేరు విన్నమాల సుబ్బమ్మ, వాకాడు మండలం గొల్లపాళెం గ్రామం . ఆమెకు కుడి వైపు కన్ను పూర్తిగా కనిపించదు. గతంలో సదరన్ సర్టిఫికెట్ ఇవ్వడంతో దివ్యాంగుల పింఛను అందుకుంటోంది. ఇప్పుడు అనర్హత పేరుతో పింఛన్ తొలగించారు. 15 ఏళ్లుగా అందుకుంటున్న పింఛన్ నేడు తొలగించారని తెలియడంతో ఎవరికి చెప్పుకోవాలో తెలియక ఆవేదన చెందుతోంది. వృద్ధ్యాప్య పింఛన్ పెట్టుకుందామంటే అంత వయస్సు లేకపోవడంతో పింఛన్ రాదని చెబుతున్నారని ఆవేదన చెందుతోంది. - వాకాడు

కన్ను లేదు..కాలు లేదు..



సోక పెంచలమ్మ, తెలుగురాయి పురం, కలువాయి మండలం

ఈ చిత్రంలో కనిపిస్తున్న మహిళ సోక పెంచలమ్మ తెలుగురాయి పురం గ్రామం. కలువాయి మండలం. ఎడమ కన్ను పూర్తిగా పోయింది. 20 సంవత్సరాలుగా వికలాంగుల పెన్షన్ తీసుకుంటున్నా. 40 శాతంగా చూపి నాకు పింఛన్ నిలుపుదల చేశారు. పింఛన్ మీద ఆధారపడి బతుకుతోంది. ఆమెకు ఇటీవల కాలు విరిగింది. ప్రస్తుతం ఆపరేషన్ చేసి కాలుకు రాడ్ వేశారు. ఆ మహిళ పింఛన్‌ను రద్దు చేశారు. ఎలా బతకాలని విలపిస్తోంది.

- కలువాయి(సైదాపురం)

పుట్టుకతోనే మూగ.. చెవుడు



సదరం సర్టిఫికెట్‌తో మల్లారపు సుబ్బమ్మ

ఈ చిత్రంలో కనిపిస్తున్న ఆమె పేరు మల్లారపు సుబ్బమ్మ. మండల కేంద్రమైన సైదాపురం. ఆమె వయస్సు 26 ఏళ్లు. పుట్టుకతో మూగ, చెవుడు. మండలంలోని అనంతమడుగు గ్రామానికి చెందిన చిరంజీవితో వివాహం అయింది. రెండేళ్ల కిందట భర్తకు ప్రమాదంలో చెయ్యి విరిగింది. ఈ పరిస్థితుల్లో భార్యా, భర్త, ఇద్దరు పిల్లలతో కలిసి ఆర్థిక ఇబ్బందుల నడుమ జీవనం సాగిస్తున్నారు. 2011లో సుబ్బమ్మకు 57 శాతం వికలత్వం సర్టిఫికెట్‌ను సదరంలో పొందారు. నాటి నుంచి నేటి వరకు దివ్యాంగుల పింఛన్ పొందుతున్నారు. తాజాగా వచ్చే నెల నుంచి పింఛన్ నిలిపివేస్తామంటూ నోటీసును జారీ చేశారు. దీంతో బాధిత కుటుంబం లబోదిబోమంటోంది. - సైదాపురం

గతంలో 68 శాతం.. రీవెరిఫికేషన్‌లో 40 శాతం



ఆరంబాకం మునిరామిరెడ్డి, దివ్యాంగుడు, తిరుపతి

అతడి పేరు ఆరంబాకం మునిరామిరెడ్డి, తిరుపతిలోని బీటీఆర్ కాలనీలో నివాసం ఉంటున్నాడు. చేతుల వికలత్వంతో ఇంటికే పరిమితం అయ్యాడు. గతంలో 68 శాతం వికలత్వం ఇచ్చారు. దాంతో రూ.6 వేల పింఛన్ తీసుకుంటున్నాడు. అయితే ఇటీవల చేపట్టిన రీవెరిఫికేషన్‌లో 40 శాతం మాత్రమే వికలత్వం ఉన్నట్లు సదరం సర్టిఫికెట్ ఇచ్చారు. దీంతో ప్రస్తుతం ఇస్తున్న రూ.6 వేల పింఛన్ సెప్టెంబర్ నెల నుంచి ఇవ్వమని చెబుతున్నారు. ఆ మేరకు సచివాలయ ఉద్యోగులు నోటీస్ ఇచ్చారు. ఎలా బతికేదని విలపిస్తున్నాడు. - తిరుపతి అర్బన్

మరుగుజ్జు లోపం ఉన్నా..



చాముండేశ్వరి, పొన్నవోలు గ్రామం

ఈమె పేరు కడివేటి చాముండేశ్వరి. వయస్సు 35 సంవత్సరాలు. చిల్లకూరు మండలం పొన్నవోలు గ్రామం. ఆమె పుట్టినప్పటి నుంచి మరుగుజ్జుగా ఉంది. చిన్నప్పుడే తల్లిని కోల్పోవడంతో తండ్రి శీనయ్య అన్ని చూసుకుంటున్నాడు. ఏడేళ్లుగా దివ్యాంగుల పింఛన్ అందుకుంటోంది. ప్రస్తుతం రూ.6 వేలు తీసుకుంటోంది. అయితే అర్హత లేదని నోటీస్ ఇచ్చి పింఛన్ తొలగించారు. - చిల్లకూరు

పక్షవాతంతో కాళ్లు, చేతులు సచ్చుబడిపోయాయి..



జ్యోతీశ్వర్‌బాబు, పాకాల

పాకాల మండలం భారతం మిట్టకు చెందిన జ్యోతీశ్వర్‌బాబు. ఆయన 1988వ సంవత్సరం నుంచి 25 రూపాయలు వికలాంగ పెన్షన్ పొందుతూ వచ్చాడు. గత ప్రభుత్వంలో రూ.15 వేలు ఇచ్చారు. ఈ ప్రభుత్వం వచ్చిన తరువాత 78 శాతం అంగవైకల్యం కలిగి ఉన్న సర్టిఫికెట్‌ను 51 శాతానికి కుదించి పింఛను తగ్గించేశారు. ప్రస్తుతం రూ.6వేలు మాత్రమే ఇస్తామని అధికారులు తెలియజేశారు. ఆయనకు పక్షవాతం వచ్చి కాళ్లు, చేతులు పనిచేయవు. ఎలా పనిచేసుకుని బతకాలో పరీక్షించిన వైద్యులే చెప్పాలని ప్రశ్నిస్తున్నాడు.

- తిరుపతి రూరల్

వికలత్వం 80శాతం ఉన్నా తొలగించారు..



ఈమె పేరు షేక్ షహీనాజ్. దొరవారి సత్రానికి చెందిన వారు. 80శాతం పైడి వికలత్వం ఉండడంతో ఆమెకు రూ.15 వేలు పింఛన్ వస్తోంది. దీంతో ఆమె ఎవరిపై ఆధార పడకుండా జీవనం సాగిస్తూ వచ్చింది. కూటమి ప్రభుత్వం రావడంతో రీవెరిఫికేషన్ పేరుతో ఈ దివ్యాంగురాలుకు వస్తున్న పింఛన్ రద్దు చేశారు. దీంతో ఆమె పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.

- దొరవారి సత్రం

షేక్ షహీనాజ్

కళ్లు, కాళ్లు పనిచేయక..ఎలా బతకాలి



నారాయణవనంకు చెందిన ఆమె పేరు తంగమణి(59). రెండు కాళ్లు పనిచేయవు. ఇటీవలే రెండు కళ్ల చూపు పోయింది. 72 శాతం సదరం సర్టిఫికెట్‌తో నెలకు 6 వేల పింఛన్ వచ్చేది. రీ వెరిఫికేషన్‌లో వైకల్యాన్ని 30 శాతానికి చూపుతూ పెన్షన్‌ను పూర్తిగా రద్దు చేస్తూ నోటీసును అందజేశారు. పింఛన్ రద్దు కావడంతో ఎలా జీవించాలని ప్రశ్నిస్తున్నారు. - నారాయణవనం

తంగమణి, నారాయణవనం

రెండు కాళ్లు పనిచేయవు..



మద్దూరి చెంగయ్య, దుర్గసముద్రం

ఆయన పేరు మద్దూరి చెంగయ్య, తిరుపతి రూరల్ మండలం దుర్గసముద్రం హరిజనవాడలో నివాసం ఉంటున్నారు. రాతి బండ కాళ్లపై పడి రెండు కాళ్లు చచ్చుబడిపోయాయి. గత ప్రభుత్వంలో రుయా ఆసుపత్రి డాక్టర్లు అన్ని రకాల పరీక్షలు చేసి కాళ్లు నడవడానికి సహకరించవని నిర్ధారించి 85 శాతంతో సదరన్ సర్టిఫికెట్ ఇచ్చారు. దాంతో అంగవైకల్యం పింఛను రూ.6 వేలు ఇచ్చారు. ఇప్పుడు పింఛను తీసేశామని నోటీసు పంపించారు. రెండు కాళ్లు పనిచేయని నాకు దిక్కెవరు.

- తిరుపతి రూరల్

క్లుప్తంగా

ఎంబీయూలో అంతర్జాతీయ సదస్సు



సదస్సులో ప్రసంగిస్తున్న ఎంబీయూ వీసీ నాగరాజ్ రామారావు

చంద్రగిరి : మోహన్‌బాబు యూనివర్సిటీ(ఎంబీయూ)లోని స్కూల్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ ఆధ్వర్యంలో హెర్బల్ మెడిసిన్స్ అండ్ న్యాచురల్స్ ప్రొడక్ట్స్ ఫ్రమ్ ట్రడిషన్ టు మాడర్న్ థెరప్యూటిక్స్ అనే అంశంపై మూడు రోజుల అంతర్జాతీయ సదస్సును శుక్రవారం ప్రారంభించారు. గురువారం నుంచి మూడు రోజుల పాటు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ సదస్సులో ప్రధాన అంశంగా 'మోడర్న్ సైన్స్ ద్వారా సంప్రదాయ వైద్యాన్ని గ్లోబలైజ్ చేయడం' పై చర్చలు నిర్వహించారు. ఎంబీయూ వీసీ ప్రొఫెసర్ నాగరాజ్ రామారావు అధ్యక్షతన ప్రసంగించారు. ఆరోగ్య చైతన్యం పెంపొందించడం, ఖరీదైన వైద్యం అవసరం లేకుండానే వారికి సుఖ సంతోషాలను అందించడం ఈ సదస్సు ప్రధాన లక్ష్యంగా ఆయన పేర్కొన్నారు. వైజ్ఞానిక సమావేశానికి శ్రీ వెంకటేశ్వర ఆయుర్వేద కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రేణు దీక్షిత్ అధ్యక్షత వహించారు. ఆయుర్వేద ఔషధాల ప్రాధాన్యం, వ్యాధుల నివారణలో వాటి పురోగతి, రోజువారీ జీవితంలో యోగా అవసరం, జీవనశైలిలో మార్పుల ప్రాముఖ్యంపై సూచనలు చేశారు. ఈ సదస్సుకు దేశ, విదేశాల నుంచి 300 మందికి పైగా ప్రతినిధులు హాజరైనట్లు యూనివర్సిటీ అధికారులు తెలిపారు.

తిరుమల ఘాట్‌లో ప్రమాదం



తిరుమల : తిరుమల మొదటి ఘాట్ రోడ్‌లో ప్రమాదం జరిగిన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. నారవారిపల్లికి చెందిన శ్రీవారి భక్తులు తిరుమల శ్రీవారి దర్శనాన్ని ముగించుకొని తిరుపతికి వెళుతుండగా 26 మలుపు వద్ద బ్రేక్ ఫెయిల్ అయింది. ఈ క్రమంలో ఆర్టీసీ బస్సు వెనుక నుంచి ఢీకొన్నాయి. వెంటనే ఎయిర్ బెలూన్స్ ఓపెన్ కావడంతో భక్తులు చిన్నపాటి గాయాలతో బయటపడ్డారు. వీరిని ఘాట్ రోడ్ సిబ్బంది వెంటనే తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు.

దమ్ముంటే పట్టుకోండి?



ఇసుక డంప్ (ఫైల్)

- చిత్తూరు మండలం, అనంతాపురం గ్రావిటా ఫ్యాక్టరీ వద్ద గురువారం మధ్యాహ్నం ఓ లారీ టైర్ పేలి నిలిచిపోయింది. అటుగా వెళ్లిన గ్రామస్తులు లారీ కింది భాగంలో నీళ్లతో కూడిన ఇసుక రాలడంతో అనుమానం కలిగింది. లారీపైన కప్పిన పట్ట విప్పి చూస్తే అసలు విషయం బయటపడింది. ఇసుకపై వరి పొట్టు బ్యాగులు నింపి సరిహద్దు దాటిస్తున్నట్లు గుర్తించారు. దీనిపై పోలీసులు కేసు కూడా నమోదు చేశారు. ఈ లారీ తిరుపతి జిల్లా, గూడూరు ప్రాంతం నుంచి తమిళనాడుకు వస్తున్నట్టు పోలీసులు గుర్తించారు.
- ఆరు నెలలకు క్రితం గూడూరు నుంచి చిత్తూరు మండలం మీదుగా వెళుతున్న ఇసుక లారీని పోలీసులు పట్టుకున్నారు. బీఎస్‌ఆర్‌పేట చెక్‌పోస్టు వద్ద పట్టుకుని కేసు నమోదు చేశారు. నెల్లూరుకు చెందిన ఓ వ్యక్తితో పాటు లారీ డ్రైవర్‌పై కేసు నమోదు చేశారు.
- గంగాధరనెల్లూరు మండలంలో మూడు నెలలకు ముందు గూడూరు నుంచి తమిళనాడుకు అక్రమంగా తరలుతున్న ఇసుక లారీని పట్టుకున్నారు. జరిమానా వేసి వదిలేశారు. అలాగే గుడిపాల మండలంలో కూడా రెండు నెలలకు క్రితం ఓ లారీ పట్టుబడింది. తమిళనాడుకు వెళ్తున్న క్రమంలో పట్టుకున్నారు. కానీ జరిమానా వేసి పంపించేశారు.

..జిల్లాలో ఇలాంటివి నిత్యకృత్యంగా మారాయి. అధికార మదంతో కూటమి నేతలు అందినకాడికి ఇసుక తరలించేస్తున్నారు. సరిహద్దులు దాటించి జేబులు నింపుకుంటున్నారు. పోలీసులు కేసులు, జరిమానాలతో చేతులు దులుపుకుంటున్నారు. కానీ ఎవరిపైనా చర్యలకు ఉపక్రమించే ధైర్యం చేయలేకపోతున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.

సాక్షి టాస్క్‌ఫోర్స్: చిత్తూరు మండలం తమిళనాడు సరిహద్దుకు ఆనుకుని ఉంది. మండలం మీదుగా రాకపోకలు సులభతరంగా ఉంటాయి. బంగారెడ్డిపల్లి గ్రామం వద్ద ఎంట్రీ ఇస్తే.. బీఎస్‌ఆర్‌పేట మీదుగా జిల్లా సరిహద్దును 15 నుంచి 20 నిమిషాల వ్యవధిలో దాటేయొచ్చు. తమిళనాడు సరిహద్దులోకి చేరుకుంటే పొన్నై, సోలింగరం, తిరుత్తణి మీదుగా చైన్నైకి దూసుకెళ్లవచ్చు. మళ్లీ చిత్తూరు మండలం నుంచి గుడిపాల మండలం మీదుగా తమిళనాడుకు చేరుకోవచ్చు. లేకుంటే కమ్మతిమ్మపల్లి మీదుగా తమిళనాడులో అడుగుపెట్టవచ్చు.

పుష్ప రేంజ్‌లో కూటమి నేతల ఇసుక వ్యాపారం

- గూడూరు నుంచి చిత్తూరు మండలం మీదుగా తమిళనాడుకు తరలింపు
- పట్టించుకోని మైనింగ్‌శాఖ అధికారులు

అలాగే జీడీనెల్లూరు మండలం మీదుగా వస్తే..తూగుండ్రం నుంచి పొన్నైకు చేరుకుని బండిని చెన్నైకి తిప్పొచ్చు. దీనికి తోడు దొడ్డిదారులను అక్రమార్కులు ఎంచుకుని సరిహద్దులు దాటిస్తున్నారు.

ఇక్కడి నుంచే వ్యాపారం

గూడూరు కేంద్రంగా ఇసుక వ్యాపారం జోరందుకుంటోంది. నెల్లూరు జిల్లాలోని పెన్నానదిలో తవ్వకాలు చేసి గూడూరులో డంప్ చేసుకుంటున్నారు. అలాగే గూడూరు పరిధిలోని స్వర్ణముఖి నదిలో కూడా ఇసుక తవ్వకాలు చేపడుతున్నారు. ఇక్కడ లారీలో ఇసుక నింపి.. పుష్పారేంజ్‌లో ఇసుకను తమిళనాడుకు చేర్చే ప్ర యత్నం చేస్తున్నారు. వరిపొట్టు, వరి, కూరగాయలు, బియ్యం, నిత్యావసర సరుకులు తదితర పేర్లతో వేబిల్లులు వేసుకుని చిత్తూరు మండలం, జీడీనెల్లూరు, గుడిపాల మీదుగా తమిళనాడు చేరుస్తున్నారు.

తమిళనాడు వ్యక్తులతోనే వ్యాపారం


గూడూరులో జరిగే ఇసుక తవ్వకాల్లో తమిళనాడుకు చెందిన వ్యక్తులే కీలకంగా పనిచేస్తున్నారు. లారీకి ఇసుక నింపడం నుంచి తమిళనాడు రాష్ట్రంలో ఇసుక దింపే వరకు ఆ రాష్ట్ర వాసులే దగ్గరుండి పనిచేస్తున్నారు. కూటమి నేతలు తమిళనాడు కూలీలను నమ్మకంగా పెట్టుకుంటున్నారు. వీళ్ల తమిళనాడులోని ఇసుక దందాదారులతో చేతులు కలిపి అమ్మకాలు చేస్తున్నారు. లారీ ఇసుక రూ.లక్ష నుంచి రూ.2లక్షల వరకు విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. వీరందరికీ నెల్లూరులోని ఓ కూటమి నేత బాస్‌గా వ్యవహరిస్తున్నట్టు సమాచారం.

నిఘా ఏదీ?

చిత్తూరు, గుడిపాల, జీడీనెల్లూరు మండలాల మీదుగా జరుగుతున్న ఈ ఇసుక దందాను అరికట్టడంలో అధికారులు పూర్తిగా విఫలమవుతున్నారు. క్షేత్ర స్థాయిలోని గ్రామస్తులు పట్టిస్తే తప్ప అధికారులు కదలడం లేదు. సరిహద్దు ప్రాంతాల్లో కూడా నిఘా లేదు. దీనికారణంగా అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. ఒక వేళ పట్టుకున్నా కేసులు.. జరిమానాలతో సర్దేస్తున్నారు. ఇక ఇసుక పట్టుకుంటే బడా కూటమి నేతల నుంచి అధికారులకు ఫోన్లు వస్తున్నాయి. కొందరైతే ఏకంగా బెదిరింపులకు దిగుతున్నారు. ఈ క్రమంలో అధికారులు ఇసుక లారీలను వదిలిపెట్టాల్సి వస్తోంది.

రెండు జిల్లాల అధికారుల సహకారంతోనేనా..?

ఈ అక్రమ ఇసుక వ్యాపారానికి తిరుపతి, చిత్తూరు జిల్లాల అధికారులు పూర్తి సహాయసహకారాలు అందిస్తున్నట్టు సమాచారం. అందులో భాగంగానే ఈ అక్రమ వ్యాపారం గూడూరు నుంచి తమిళనాడుకు విస్తరించింది. ఇసుకాసురులుగా అవతామెత్తిన కూటమి నేతలకు తమిళనాడు రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద నెట్‌వర్క్ ఉంది. ఈ నెట్‌వర్క్‌తోనే ఈ అక్రమ వ్యాపారాన్ని జోరుగా నడిపిస్తున్నారు.



గూడూరు నుంచి వస్తూ చిత్తూరు మండలంలో పట్టుబడ్డ ఇసుక లారీ

వృద్ధురాలి మెడలోని బంగారు చైన్ అపహరణ

నాయుడుపేటటౌన్ : నాయుడుపేట ఆర్టీసీ బస్టాండులో బస్సు ఎక్కుతున్న నాగభూషణమ్మ అనే వృద్ధురాలి మెడలోంచి శుక్రవారం గుర్తు తెలియని వ్యక్తులు బంగారు చైన్ అపహరించారు. బాధితురాలు తెలిపిన మేరకు వివరాలు. పెళ్లకూరు మండలం ఉమ్మలపేట గ్రామానికి చెందిన నాగభూషణమ్మ నాయుడుపేట పట్టణంలోని పిచ్చిరెడ్డితోపు వీధిలో నివాసం ఉంటోంది. శుక్రవారం సూళ్లూరుపేట చెంగాళమ్మ ఆలయానికి వెళ్లేందుకు నాయుడుపేట ఆర్టీసీ బస్టాండుకు చేరుకుంది. రద్దీగా ఉన్న బస్సు ఎక్కుతుండగా ఆమె మెడలో ఉన్న రెండు సవర్ల బంగారు చైను గుర్తు తెలియని వ్యక్తి అపహరించుకుని పరారైనట్లు బాధితురాలు తెలిపింది. నాగభూషణమ్మ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేసింది. పోలీసులు ఆర్టీసీ బస్టాండు సమీపంలో ఉన్న సీసీ కెమెరాల పుటేజీలను పరిశీలిస్తున్నారు.

ఆ డిపోలు.. స్త్రీశక్తికి దూరం

తిరుపతి అర్బన్ : మహిళలకు ఆర్టీసీలో ఉచిత బస్సు సౌకర్యాన్ని కల్పిస్తామని చంద్రబాబు చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత పలు ఆంక్షలతో 16 రకాల బస్సుల్లో కేవలం 3 రకాల బస్సులను మాత్రమే ఉచితం చేశారు. జిల్లాలో 11 డిపోల పరిధిలో 855 సర్వీసులు ఉంటే కేవలం 356 సర్వీసుల్లో మాత్రమే స్త్రీశక్తి పథకం అమలు చేశారు. తిరుపతి నగరంలోని అలిపిరి డిపో పరిధిలో 147 సర్వీసులు ఉన్నాయి. అయితే అందులో 100 బస్సులు ఏసీ విద్యుత్ సర్వీసులు, 34 సప్తగిరి బస్సులు తిరుపతి-తిరుమల తిరుగుతున్నాయి. 13 సప్తగిరి సర్వీసులు తిరుపతి- బెంగుళూరు తిప్పుతున్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు పల్లెవెలుగు, ఆల్ట్రా పల్లె వెలుగు, సాధారణ ఎక్స్‌ప్రెస్‌లు మాత్రమే ఉచితం. అయితే ఆ మూడు రకాల బస్సులు తమ డిపోల్లో లేవని...దాంతో స్త్రీశక్తి పథకానికి అలిపిరి డిపో దూరం అంటున్నారు అధికారులు. అలాగే తిరుమల డిపో పరిధిలో 99 సర్వీసులు ఉన్నాయి. అయితే అన్ని సర్వీసులు సప్తగిరి బస్సులే ఉన్నాయి. తిరుమల డిపో కూడా స్త్రీశక్తి పథకానికి దూరం అంటూ అధికారులు స్పష్టం చేస్తున్నారు.

బంగారు తిరుచ్చిపై శ్రీవారి పట్టపురాణి



బంగారు తిరుచ్చిపై శ్రీపద్మావతి అమ్మవారు

చంద్రగిరి: తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారు శుక్రవారం సాయంత్రం బంగారు తిరుచ్చిపై భక్తులను అనుగ్రహించారు. తొలుత శుక్రవారం తెల్లవారిజామున అమ్మవారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి నిత్య కైంకర్యాలను నిర్వహించారు. అనంతరం అమ్మవారిని వజ్ర వైఢూర్యాలతో శోభాయమానంగా అలంకరించి, భక్తులకు దర్శనం కల్పించారు. ఆ తర్వాత ఆలయ శ్రీకృష్ణ ముఖ మండపం వద్ద కల్యాణోత్సవాన్ని పాంచరాత్ర ఆగమోక్తంగా నిర్వహించారు. సాయంత్రం అలంకార మండపంలో ఉయ్యాలసేవలో స్వామి అమ్మవార్లు సేద దీరారు. ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

జానపద విజ్ఞానాన్ని కాపాడుకోవాలి



విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు

తిరుపతి సిటీ : మరుగున పడుతున్న జానపద విజ్ఞానాన్ని కాపాడుకోవాలని వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు పిలుపునిచ్చారు. ప్రపంచ జానపద విజ్ఞాన దినోత్సవాన్ని శుక్రవారం ఎస్వీయూలోని శ్రీనివాస ఆడిటోరియంలో స్టూడెంట్ వెల్ఫేర్ అండ్ కల్చరల్ అఫైర్స్ కోఆర్డినేటర్ డాక్టర్ పత్తిపాటి వివేక్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన వీసీ మాట్లాడుతూ.. ప్రాచీనమైన ఎన్నో జానపద కళలు అంతరిస్తున్నాయన్నారు. సరైన ఆదరణ లేకపోవడమే జానపద కళలు అంతరించడానికి ప్రధాన కారణమని అభిప్రాయపడ్డారు. జానపద కళలను రాబోయే తరానికి అందించాలని సూచించారు. రిజిస్ట్రార్ భూపతి నాయుడు మాట్లాడుతూ.. జానపద కళల్లో ఎన్నో విజ్ఞానదాయక విషయాలు దాగి ఉన్నాయని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన నాటికలు, నృత్యాలు వీక్షకులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు,

ప్రభుత్వ పాఠశాలలు దత్తత

నాయుడుపేటటౌన్ : మండల పరిధిలోని గిరిజన కాలనీల్లో ఉన్న 8 ప్రభుత్వ ప్రాథమిక పాఠ శాలలను దత్తత తీసుకుంటామని రోటరీ క్లబ్ అధ్యక్షుడు అదవరం నాగూరయ్య వెల్లడించారు. పట్టణంలోని ట్రీనిటి వైద్యశాలకు సంబంధించి వైద్యుల ఆధ్వర్యంలో పాఠశాలలో చదువుతున్న గిరిజన విద్యార్థులతో పాటు తల్లిదండ్రులకు ఉచితంగా వైద్య సేవలను అందించ డం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమాన్ని మొదటగా మండల పరిధిలోని మందబైలు గిరిజన కాలనీలో ప్రభుత్వ వైద్యశాల వద్ద శుక్రవారం విద్యార్థులతో పాటు తల్లిదండ్రులకు అవగాహన కలిగించారు. ప్రతి నెలా ట్రీనిటి శిశు సంజీవిని పేరుతో దత్తత తీసుకున్న ప్రభుత్వ పాఠశాలలో ఉచితంగా అన్ని రకాల వైద్య చికిత్సలు చేసి మందులు అందిస్తామన్నారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు వైద్యంతో పాటు విద్యాపరంగా తమ వంతు సహకారం ఉంటుందన్నారు. ఈ సందర్భంగా అదవరం అలైనా ప్రిషా విద్యార్థులకు విద్యా సామగ్రిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ మునిరత్నం, వైద్యులు ఆదవరం సందీప్, దీప్తి, అనుదీప్, నీలిమ, లతీఫ్, ఆదవరం పవని, జువ్వలపాళెం సర్పంచ్ తొప్పని రమణయ్య, హెచ్‌ఎం మస్తానయ్య, ఎస్‌ఎంసీ చైర్మన్ సుగుణమ్మ పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 24 గంటలు

తిరుమల : తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూ కాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు నిండాయి. క్యూ లైన్ కృష్ణతేజ అతిథి గృహం వద్దకు చేరుకుంది. గురువారం అర్ధరాత్రి వరకు 65,112 మంది స్వామి వారిని దర్శించుకోగా 27,331 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామి వారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.49 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 24 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనమవుతోంది. ఇదిలా ఉంటే సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలోకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది.

తిరుపతి కోర్టుకు చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి



కోర్టు సముదాయం ముందు పార్టీ నాయకులు, కార్యకర్తలతో చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

తిరుపతి రూరల్ : చంద్రగిరి నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి, తుడా మాజీ చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి శుక్రవారం తిరుపతి కోర్టుకు హాజరయ్యారు. గత సార్వత్రిక ఎన్నికల సమయంలో శ్రీ పద్మావతీ మహిళా యూనివర్సిటీ వద్ద నున్న కౌటింగ్ సెంటర్ వద్ద జరిగిన గొడవల్లో అక్రమంగా 36 మంది వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై పోలీసులు హత్యాయత్నం కేసు పెట్టారని, అందులో 37వ నిందితుడిగా చెవిరెడ్డి మోహిత్‌రెడ్డిని చేర్చినట్టు ఆయన వివరించారు. అక్రమంగా పెట్టిన కేసులో న్యాయస్థానం ముందు హాజరుకావడం జరిగిందన్నారు. అక్రమంగా పెట్టిన కేసులో తనతో పాటు 37 మంది కోర్టుకు రావాల్సి వచ్చిందని, ప్రతిపక్షంలో ఉన్నందున ఈ అక్రమ కేసులు ఎదుర్కోక తప్పదన్నారు. తనతో పాటు కోర్టుకు వచ్చిన వారందరికీ ధైర్యం చెప్పిన చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి అందరికీ అండగా నిలబడతానని హామీ ఇచ్చారు.

కారు దగ్ధం

శ్రీకాళహస్తి : పట్టణంలోని పురపాలక కార్యాలయం సమీపంలో ఓ కారు శుక్రవారం రాత్రి దగ్ధమైంది. ఓ మెకానిక్ షాప్‌లో వెల్డింగ్ చేస్తుండగా నిప్పు రవ్వలు ఎగిసి పడటంతో మంటలు అంటుకున్నాయి. దీంతో కారు దగ్ధమైంది. అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలను అదుపు చేశారు.

మట్టి వినాయకున్ని పూజిద్దాం

నగర పాలక సంస్థ మేయర్ డాక్టర్ శిరీష పిలుపు



'మట్టి వినాయకుని పూజిద్దాం..' పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మేయర్, ఎమ్మెల్సీ, ఉత్సవ కమిటీ సభ్యులు

తిరుపతి కల్చరల్: తిరుపతి ప్రజలు వినాయక చవితి వేడుకల్లో మట్టి వినాయకునికి పూజలు చేయాలని తద్వారా పర్యావరణ పరిరక్షణకు దోహదపడాలని తిరుపతి నగర పాలక సంస్థ మేయర్ డాక్టర్ శిరీష, ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం పిలుపునిచ్చారు. తిరుపతి శ్రీవరసిద్ధి వినాయక నిమజ్జన మహోత్సవ కమిటీ కార్యాలయంలో శుక్రవారం పోస్టర్లను నిర్వాహకులతో కలిసి ఆవిష్కరించారు. మేయర్ మాట్లాడుతూ, చవితి ఉత్సవ, నిమజ్జన కార్యక్రమాల విషయంలో నగర పాలక సంస్థ తరఫున అన్ని ఏర్పాట్లు చేస్తామన్నారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ సాంప్రదాయబద్ధంగా చవితి వేడుకలు జరుపుకోవాలని కోరారు. అలాగే, ఈస్ట్ పోలీస్‌స్టేషన్ డీఎస్పీ భక్తవత్సలం వినాయక కమిటీ కమిటీ సభ్యులతో చర్చించారు. కార్యక్రమంలో కమిటీ కన్వీనర్ సామంచి శ్రీనివాస్, కార్పొరేటర్ రామస్వామి వెంకటేశ్వర్లు, కమిటీ సభ్యులు గుండాల గోపినాథ్‌రెడ్డి, కరాటే శ్రీనివాసులురెడ్డి, బాబు, కిరణ్, చెంగారెడ్డి, సుబ్రమణ్యంరెడ్డి, సుబ్బరామయ్య, రవిప్రసాద్, ఆనంద్ పాల్గొన్నారు.

25 నుంచి హెవీ డ్రైవింగ్ లైసెన్స్ శిక్షణ



హరిబాబు, అలిపిరి డ్రైవింగ్ స్కూల్ ప్రిన్సిపల్, డిపో మేనేజర్

తిరుపతి అర్బన్ : ఈనెల 25 నుంచి 33వ బ్యాచ్‌కి హెవీ డ్రైవింగ్ లెసెన్స్ కోసం శిక్షణ ప్రారంభిస్తామని అలిపిరి డ్రైవింగ్ స్కూల్ ప్రిన్సిపల్, అలిపిరి ఆర్టీసీ డీఎం హరిబాబు వెల్లడించారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 23వ తేదికి 32వ బ్యాచ్ శిక్షణ పూర్తి అవుతుందని చెప్పారు. తర్వాత రెండు రోజుల అంతరం 33వ బ్యాచ్ ప్రారంభం అవుతుందని తెలిపారు. మరోవైపు జిల్లాలో 10 మంది ఎస్సీ, ఎస్టీలకు హెవీ డ్రైవింగ్ లైసెన్స్ శిక్షణ ఉచితంగా ఇవ్వడానికి ఆదేశాలు రానున్నాయని చెప్పారు. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా వారిని ఎంపిక చేస్తారని వెల్లడించారు. ఎంపిక చేసిన వారికి ఉచితంగా శిక్షణ ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నట్లు స్పష్టం చేశారు. అలిపిరి డిపోలో హెవీ డ్రైవింగ్ లైసెన్స్ పొందడం కోసం శిక్షణ తీసుకున్న వారిలో 60శాతం మందికి స్థానికంగానే ఉద్యోగ అవకాశాలు లభించాయని వివరించారు.

నేటితో ముగియనున్న డీఫార్మసీ దరఖాస్తులు

తిరుపతి సిటీ : ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో డీఫార్మసీ కోర్సులో ప్రవేశాలకు శనివారంతో ముగియనున్నట్లు ప్రిన్సిపల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఇప్పటికే సాంకేతిక విద్యామండలి నుంచి తమకు ఆదేశాలు అందినట్లు తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు,

పది టాపర్లకు నగదు ప్రోత్సాహకాలు

సత్యవేడు: ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో 10వ తరగతిలో పరీక్షల్లో టాపర్లుగా మార్కులు పొందిన విద్యార్థినీవిద్యార్థులకు పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో నగదు ప్రోత్సాహకాలు అందజేశారు. గురువారం పూర్వవిద్యార్థుల సంఘం ప్రధాన కార్యదర్శి జె.పాండురంగయ్య ఆధ్వర్యంలో సంఘం నాయకులు బి.బాలసుందరంరెడ్డి, డి.రవి, బండారు మోహన్‌బాబు, ఆనంద్ కలసి రూ.10 వేలు, కె.పావని రూ.6వేలు, ఎం.దర్శిని, ఎం.అంకిత గ్రేస్ రూ.4 వేలు నగదు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం మాధవీలత తదితరులు పాల్గొన్నారు.